సినిమా రంగం కోసం ప్రత్యేక విధానం

త్వరలో సమగ్ర విధానంతో ముందుకు వస్తాం

పరిశ్రమ అభివృద్ధి కోసం అనేక చర్యలు

చిన్న థియేటర్లను రక్షించుకోవాల్సి ఉంది

పరిశ్రమ పెద్దలతో చర్చించడానికి సిద్ధం

మీడియా సమావేశంలోమంత్రి కందుల దుర్గేశ్

సృజనక్రాంతి/రాజమహేంద్రవరం : అగ్ర కథానాయకుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన 'హరి హర వీరమల్లు'మూవీ విడుదల సమయంలోనే థియేటర్ల బంద్ అనే అంశం ఎందుకు తెరపైకి తీసుకొచ్చారని ఏపీ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రశ్నించారు. 'మాకు ప్రభుత్వంతో సంబంధం లేదు. మా నిర్ణయాలు మేము తీసుకుంటాం' అంటున్న కొందరు, దానిని రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న వైసీపీ.. కొన్ని వాస్తవాలను గ్రహించాలన్నారు. ఏపీ ప్రభుత్వం సినిమా పరిశ్రమకు అన్ని విధాలా సహకరిస్తుంటే ఇలాంటి వ్యాఖ్యలు సరైనవి కావన్నారు. సోమవారం ఆయన రాజమహేంద్రవరంలో విలేకరుల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. 'సినిమాల విషయంలో పవన్ కళ్యాణ్ మాట్లాడింది స్పష్టమైంది. త్వరలో సినిమా ఇండస్ట్రీకి సంబంధించిన కొత్త పాలసీ తీసుకురాబోతున్నాం. సినిమా ఇండస్ట్రీ వారితో చర్చించడానికి కూడా సిద్ధంగా ఉన్నాం. సినిమా పరిశ్రమకు ఏపీ ప్రభుత్వం ఎంతో సహకరిస్తోంది. ప్రస్తుతం సినిమా పరిశ్రమ, ఏపీ ప్రభుత్వం మధ్య నెలకొన్న పరిస్థితులపై అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. హరి హర వీరమల్లు' మూవీ విడుదల సమయంలోనే థియేటర్ల బంద్ విషయం ఎందుకు తెరపైకి వచ్చింది. ఆ టాపిక్ బయటకు వచ్చినప్పుడు తక్షణమే స్పందించి నిర్ణయాన్ని తెలియజేయాల్సింది కదా! ఏడాదిగా ఏపీ ప్రభుత్వం ఏనాడైనా మీ సినిమాలకు ఇబ్బంది కలిగించిందా? సినీ నిర్మాతలు విడివిడిగా వచ్చి అడిగినా.. టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చాం. సమష్టిగా రండి. సినీ పరిశ్రమ సమస్యలు పరిష్కరించుకుందాం. అల్లు అరవింద్‌గారి వ్యాఖ్యలు సహేతుకంగా ఉన్నాయి. ప్రస్తుతానికి థియేటర్ల బంద్ లేదన్నారు కాబట్టి, సమస్య సమసిపోయినట్టేనని అనినారు. త్వరలో సమగ్ర విధానం తీసుకుని వస్తామని అన్నారు. భవిష్యత్తులో ఏ రకంగా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై కార్యాచరణ అవసరం. పరిశ్రమకు తొలి నుంచి గౌరవమిస్తూ, ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇప్పుడూ చలన చిత్రాభివృద్ధి జరగాలని కృషి చేసిన వ్యక్తి చంద్రబాబునాయుడుగారు. ఆ రోజుల్లోనే ఆయనకున్న పరిచయాల ద్వారా వివిధ కార్యక్రమాలను చేపట్టారు. ప్రతి సినిమా విడుదలకు సదరు నిర్మాతలు నా దగ్గరకు వచ్చి టికెట్ రేట్లు పెంచాలని కోరుతున్నారు. ఏ చిత్రం అయినా బడ్జెట్‌ను చూసి ధరలు పెంచమని అభ్యర్థిస్తున్నారు. మేము సంబంధిత శాఖతో మాట్లాడి చెబుతున్నాం. అందరూ ఓ విషయం అర్థం చేసుకోవాలి. పరిశ్రమకు సంబంధించిన అంశాలు సినిమాటోగ్రఫీశాఖ పరిధిలో ఉన్నప్పటికీ థియేటర్లు, టికెట్ ధరల పెంపును హోంశాఖ ముఖ్య కార్యదర్శి చూస్తారు. సినిమా రంగానికి సహకారం అందించాలని డిప్యూటీ– సీఎం పవన్‌కల్యాణ్ చెబుతూనే ఉన్నారు. తగిన సూచనలు సైతం చేస్తున్నారు. వాటికి అనుగుణంగా టికెట్ ధరల పెంపు విషయంలో నిర్ణయం తీసుకుంటున్నాం. అయితే, పెంచిన రేట్లపై కొందరు కోర్టులో పిల్ దాఖలు చేస్తున్నారు. దీంతో ప్రతి సినిమాకు ప్రిన్సిపల్ సెక్రటరీ లేక సంబంధిత శాఖకు చెందిన అధికారులు కోర్టుకు వెళ్లి సమాధానం చెప్పాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రేట్ల పెంపును ఆమోదించడానికి ఇబ్బంది పడుతున్నా.. సినిమా పరిశ్రమకు సహకరించాలనే ఉద్దేశంతో ఏడాది కాలంగా అనుమతులు ఇస్తున్నాం. అయితే, కొంతమంది 'మా సమస్యలు మేమే పరిష్కరించుకుంటాం, బయట వారు ఎవరూ రావొద్దు' అంటున్నారు. అది అహంకార పూరితంగా అనిపిస్తోంది. ఎవరి ప్రోద్బలంతో ఇలా అంటున్నారో తెలియదని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం అగ్ర హీరోలందరినీ పిలిచి ఏ విధంగా అవమానించిందో అందరం చూశాం. అప్పుడు మంత్రులుగా పనిచేసిన వారు ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. 'సినిమా అనేది వ్యాపారమని, దానికి సంబంధించిన నిర్ణయాలు వాళ్లే తీసుకుంటారు' అని అంటున్నారు. అప్పుడు మీరు చేసిన నిర్వాకాలు ఏంటో అందరికీ తెలుసు. సినిమాకు సంబంధించిన విషయాల్లో ప్రభుత్వ సహకారం ఏదో ఒక స్థాయిలో కచ్చితంగా ఉంటుంది. ఆ మాజీ మంత్రి వ్యాఖ్యలు చూస్తుంటే.. అసలు మానవత్వం ఉందా?అనిపిస్తోంది. ఒక పోరాట యోధుడి కథతో రూపొందిన చిత్రం 'ఫ్లాప్ మూవీ' అంటున్నారు. సినిమా విడుదల కాకముందే స్టేట్‌మెంట్ ఇచ్చారంటే.. ఆయన ఎంతమంది కుటుంబాలతో ఆడుకున్నాడో అర్థమవుతోంది. బాధ్యత కలిగిన మంత్రిగా పనిచేసిన వ్యక్తి మాట్లాడే మాటలేనా ఇవి? ఎదుటి వ్యక్తి చనిపోవాలని కోరుకోవడం ద్వారా రాజకీయ ప్రయోజనాలు ఆశిస్తున్నావా? అసలు నీకు మానవత్వం ఉందా? ఇలాంటి వారే 'జంతు సమాన.. మూర్ఖత్వానికి నమూనా..' అని జంధ్యాలగారు ఎప్పుడో చెప్పారు. ప్రజలందరూ మీ చర్యలను గమనిస్తున్నారని మంత్రి అన్నారు. సినిమా రంగానికి సహకరిస్తున్నప్పుడు మీరు వచ్చి కలిస్తే సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పాం. కలవటం, కలవకపోవటం వారి విజ్ఞతకే వదిలేశాం. వారు రాలేదని మేమెప్పుడైనా సినిమాలను అడ్డుకున్నామా? మనందరం కలిసి సమస్యలు పరిష్కరించుకుందామని నేను లేఖరాశాను. సినిమా ఇండస్ట్రీకి ఒక పాలసీ తీసుకొద్దామని అంటున్నాం. ఎగ్జిబిటర్లకు సమస్యలు ఉన్నాయి. సింగిల్ థియేటర్ల వాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటివి పరిష్కరించుకోవడానికి ఓ విధానం తీసుకొస్తామని చెబుతున్నాం. అలాగే మల్టీప్లెక్స్‌లో టికెట్, తినుబండారాల ధరలపైనా విధి విధానాలు రూపొందించ బోతున్నాం. ఇందుకు సంబంధించి విచారణకు ఆదేశించాం. నివేదిక వచ్చిన తర్వాత దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటాం. గత ప్రభుత్వంలా కక్షసాధింపు చర్యలు మాత్రం ఉండవని కందుల దుర్గేష్ అన్నారు. మమ్మల్ని కలవ లేదని ఏరోజూ తెలుగు సినిమా నిర్మాతల్ని తాము ఇబ్బంది పెట్టలేదని ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సినీ ప్రముఖులు కలవలేదని తాము ఎప్పుడైనా పరిశ్రమకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నామా? అని ప్రశ్నించారు. హరిహర వీరమల్లు సినిమా రిలీజ్ ముందు ప్రపంచంలో థియేటర్లో బంధు అనే విషయం ఎందుకు బయటకు వచ్చిందన్నారు. సినిమాల విషయంలో పవన్ కళ్యాణ్ మాట్లాడింది స్పష్టమైన వైఖరి అని పేర్కొన్నారు. సినిమా విషయాలపై పరిజ్ఞానం లేని వారు మాట్లాడుతున్నారని మంత్రి కందుల దుర్గేష్ ఫైర్ అయ్యారు. ఏపీ రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధి, సినీ రంగానికి సంబంధించి ఇటీవల చోటుచేసుకున్న పలు పరిణామాల గురించి మంత్రి కందుల దుర్గేష్ స్పందించారు. కొందరి మాటలు అహంభావపూరితంగా ఉన్నాయి. ప్రతిసారీ ఎవరో ఒకరు టికెట్లు– పెంచమని వస్తున్నారు, మేం ఓకే చేస్తున్నాం. ఆ వెంటనే ఎవరో ఒకరు కోర్టుల్లో పిల్ వేస్తున్నారు. అధికారులు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. అయినా మేం సినిమా పరిశ్రమ అభివృద్ధి కోసం మేం రేట్లు–పెంపునకు అనుమతిస్తున్నాం' అని అన్నారు. తెలుగు సినిమా పెద్దలు ఏపీ ప్రభుత్వాన్ని కలుస్తారా లేదా అనేది వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నాం. మమ్మల్ని కలవలేదని ఏరోజూ తెలుగు సినిమా నిర్మాతల్ని ఇబ్బంది పెట్టలేదు. సినిమా టికెట్ల రేట్లకు సంబంధించి శాశ్వత విధానాన్ని ఏపీ ప్రభుత్వం రూపొందించబోతుంది. హరిహర వీరమల్లు విడుదలకు ముందే బంద్ అనే అంశం ఎందుకు తెరపైకి వచ్చింది. బంద్ అనే విషయం ముందే తెలిసినా ఫిల్మ్ ఛాంబర్ ఎందుకు స్పందించలేదు. తెలుగు ఫిల్మ్ చాంబర్ ముందుగానే స్పందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఏపీ ప్రభుత్వాన్ని కలవాల్సిందని నిర్మాత అల్లు అరవింద్ ఇప్పుడు చెప్పడం హర్షణీయం. ఈ వ్యవహారం నుంచి వైసీపీ లబ్ధి పొందాలని చూస్తుందని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.

మాజీమంత్రి కాకాణికి 14 రోజుల రిమాండ్

వెంకటగిరి కోర్టు ఆదేశాలు జారీ

నెల్లూరు : క్వార్ట్జ్ అక్రమాల కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి వెంకటగిరి కోర్టు రిమాండ్ విధించింది. అక్రమ మైనింగ్ కేసులో ఏ4గా ఉన్న కాకాణికి 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. ఈ కేసులో ఆదివారం కాకాణిని బెంగళూరు సమీపంలో పోలీసులు అరెస్ట్ చేసి.. సోమవారం నెల్లూరు జిల్లా వెంకటగిరికి తీసుకొచ్చారు. విచారణ తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వెంకటగిరి కోర్టులో హాజరుపర్చారు. ముందుగా వాదనలు విన్న జడ్జి.. లంచ్ తర్వాత కాకాణికి 14 రోజుల పాటు– రిమాండ్ విధిస్తూ తీర్పు చెప్పారు. మాజీ మంత్రిని నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో కాకాణిని వెంకటగిరి నుంచి నెల్లూరు తీసుకువచ్చి.. జిల్లా సెంట్రల్ జైలుకు తరలించారు. క్వార్ట్జ్ అక్రమాలు, భారీ పేలుళ్ల పదార్థాల వినియోగం, అట్రాసిటీ– కేసుకు సంబంధించి కాకాణి ఏ4గా ఉన్నారు. కాకాణిని కోర్టుకు తీసుకువస్తున్నందుకు ఆ ప్రాంతంలో పోలీసులు 144 సెక్షన్‌ను విధించారు. దీన్ని ఉల్లంఘిస్తూ వైసీపీకి చెందిన నేతలు కోర్టు ప్రాంగణం వద్ద గుమిగూడారు. ఈ కేసుకు సంబంధించి దాదాపు రెండు నెలలుగా మాజీ మంత్రి తప్పించుకుని తిరుగుతున్నారు. తాను ఎక్కడికీ పోలేదని.. నెల్లూరులోనే ఉంటానని, ఈ కేసులకు భయపడను అంటూ మొదట్లో చెప్పుకొచ్చారు మాజీ మంత్రి. కానీ ఆ తరువాత అకస్మాత్తుగా కాకాణి అదృశ్యమయ్యారు. ఆపై రెండు నెలలుగా పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ కేసుకు సంబంధించి మూడు సార్లు పోలీసులు కాకాణికి నోటీ–సులు జారీ చేశారు. మూడు సార్లు నోటీ–సులు ఇచ్చిన సమయంలో కాకాణి లేకపోవడంతో రెండు సార్లు ఇంటి గోడకు నోటీ–సులు అతికించగా.. మూడో సారి బంధువులకు అందజేశారు. అయినప్పటికీ కాకాణి పోలీసుల విచారణకు హాజరుకాలేదు. దీంతో ఆయన కోసం పోలీసులు తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు బెంగుళూరు శివారులోని ఓ రిసార్ట్‌లో కాకాణిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆపై ఆయనను విచారించగా.. పోలీసులకు ఏమాత్రం సహకరించలేదని తెలుస్తోంది. తనకేమీ తెలియదని, ఈ కేసుతో సంబంధం లేదని చెప్పినట్లు– సమాచారం. ఆపై మాజీ మంత్రిని వెంకటగిరి కోర్టులో హాజరుపర్చగా.. 14 రోజుల రిమాండ్ విధించింది న్యాయస్థానం. మరోవైపు కాకాణిని కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ వేసే అవకాశం ఉంది. మరో రెండు రోజుల్లో కోర్టులో పిటిషన్ వేసి విచారణ నిమిత్తం కాకాణిని కస్టడీకి కోరే అవకాశం ఉంది.

పూర్తిస్థాయి డిజిపిగా హరీష్ గుప్తా

సృజనక్రాంతి/అమరావతి : ఆంధ్రప్రదేశ్ పూర్తిస్థాయి రాష్ట్ర డీజీపీగా హరీష్ కుమార్ గుప్తాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియమించారు. రెండు సంవత్సరాల పాటు– డీజీపీగా హరీష్ కుమార్ గుప్తా కొనసాగనున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్యానెల్ నుంచి హరీష్ కుమార్ గుప్తా పేరును సీఎం చంద్రబాబు ఎంపిక చేశారు. ఇప్పటివరకు ఏపీ ఇన్‌చార్జి డీజీపీగా హరీష్ కుమార్ గుప్తా ఉన్న విషయం తెలిసిందే. ఈమేరకు ఏపీ పూర్తిస్థాయి డీజీపీగా హరీష్‌కుమార్ గుప్తా కొనసాగనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హరీశ్‌కుమార్ గుప్తా 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. జమ్మూకశ్మీర్‌కు చెందిన ఆయన.. ఖమ్మం ఏఎస్పీగా తన తొలి పోస్టింగ్ పొందారు. మెదక్, పెద్దపల్లిలలో ఏఎస్పీగా సేవలందించారు. కృష్ణా, నల్గొండ జిల్లాల ఎస్పీగా, హైదరాబాద్ సౌత్‌జోన్ డీసీపీగా కీలక బాధ్యతలు నిర్వహించారు. గుంటూరు రేంజి ఐజీగా, శాంతిభద్రతల విభాగం, ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ విభాగం అదనపు డీజీపీగా పనిచేశారు. పోలీసు నియామక మండలి ఛైర్మన్‌గా, రైల్వే డీజీగా విధులు నిర్వహించారు. 2022 మే నుంచి హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా సేవలందించారు. జనవరి 31న అప్పటి డీజీపీ ద్వారకా తిరుమలరావు పదవీ విరమణ చేయడంతో.. ఇన్‌ఛార్జి డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తాను ప్రభుత్వం నియమించింది. తాజాగా పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించింది.

వంశీకి వరుస షాక్‌లు

నకిలీ ఇళ్ల పట్టాల కేసులో బెయిల్ తిరస్కరణ

సృజనక్రాంతి/విజయవాడ : వైఎస్సార్ కాంగ్రెస పార్టీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి వరుసగా షాక్‌లు తగులుతున్నాయి.. ఇప్పటికే నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో వల్లభనేని వంశీ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ను నూజివీడు కోర్టు కొట్టివేసింది.. మరోవైపు.. వల్లభనేని వంశీని రెండోసారి కస్టడీకి కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు పోలీసులు.. నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో వంశీని మూడు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు తాజాగా పిటిషన్ వేశారు.. ఇప్పటికే ఇదే కేసులో రెండు రోజుల పాటు వల్లభనేని వంశీని న్యాయస్థానం కస్టడీకి ఇచ్చింది.. అయితే, వంశీ సరిగా విచారణకు సహకరించక పోవటంతో మరోసారి కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు మరోసారి కోర్టు మెట్లు ఎక్కారు.. అయితే, పోలీసుల పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన నూజివీడు కోర్టు.. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.. కాగా, ఇప్పటికే పలు కేసుల్లో బెయిల్, ముందస్తు బెయిల్ పొందారు వల్లభనేని వంశీ.. కానీ, చివరల్లో నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో కోర్టు వల్లభనేని వంశీపై పీటీ– వారెంట్‌కు అనుమతి ఇవ్వడంతో కథ అడ్డం దిరిగింది.. ఇక, నకిలీ ఇళ్ల పట్టాల కేసుకు సంబంధించి రిమాండ్‌లో ఉన్న వల్లభనేని వంశీ పలుమార్లు అస్వస్థతకు గురయ్యారు.. మెరుగైన చికిత్స నిమిత్తం ఆయన్ను పోలీసులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆయన ఇబ్బంది పడుతున్నట్లుగా తెలుస్తుండగా.. ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించారు.. మరోవైపు.. ఈ విషయం తెలుసుకుని జీజీహెచ్‌కు చేరుకున్న వల్లభనేని వంశీ భార్య పంకజశ్రీని.. వంశీని కలిసేందుకు పోలీసులు అనుమతించలేదు.. దీంతో, ఆమె పోలీసులతో వాగ్వాదానికి దిగారు.మరోవైపు.. నూజివీడు కోర్టులో వల్లభనేని వంశీకి చుక్కెదురైంది. వంశీ మోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ కేసులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు వల్లభనేని వంశీ.. అయితే, దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి.. బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. వంశీ ప్రస్తుతం ఇదే కేసులో అరెస్టై విజయవాడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం విదితమే.. ఇకపోతే వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు పోలీసులు తీసుకొచ్చారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న వంశీకి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి తీసుకొచ్చారు. వంశీ పోలీస్ కస్టడీలో ఉండగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ముందుగా కంకిపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సోమవారం ఉదయం కంకిపాడు నుంచి గుంటూరు జీజీహెచ్‌లో చేర్చారు.

ఏడాదిలో ఇచ్చిన హామీలు ఎన్ని అమలు చేశారు

మహానాడులో తీర్మానం చేసే దమ్ముందా : మాజీమంత్రి రోజా

సృజనక్రాంతి/తిరుపతి : కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు భయపడే వాళ్లు ఇక్కడ ఎవరూ లేరని మాజీ మంత్రి, వైసీపీ నేత ఆర్కే రోజా అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేశారన్నారు. రోజుకొకరిపై అక్రమ కేసులు పెట్టడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పెట్టుకుందని విమర్శించారు. రాబోయే రోజుల్లో కూటమి నేతలు చేసిన పనులకు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉంటుంద న్నారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయ్యాక రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి.. అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఎలా ఉంటుందో చూపిస్తామని రోజా చెప్పుకొచ్చారు. తిరుపతిలో మాజీ మంత్రి ఆర్కే రోజా మీడియాతో మాట్లాడుతూ...ఏడాదిలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని మహానాడులో తీర్మానం చేసే దమ్ము టీడీపీకి నేతలకు ఉందా?. ఏ హామీలు అమలు చేశారని మహానాడు నిర్వహిస్తున్నారో టీడీపీ నేతలు సమాధానం చెప్పాలి. పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, కాకాణిపై కేసులు అక్రమంగా పెట్టారు. అక్రమ కేసులకు భయపడే వారు ఇక్కడ ఎవరూ లేరు. రాబోయే రోజుల్లో కూటమి నేతలు చేసిన పనులకు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. జగన్ మళ్లీ సీఎం అయ్యాక రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఎలా ఉంటుందో చూపిస్తాం. లిక్కర్, ఇతర స్కామ్ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు' అని మండిపడ్డారు.

వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్పు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సృజనక్రాంతి/అమరావతి : మరోసారి మారిన కడప పేరుకు శ్రీకారం చుట్టింది ప్రభుత్వం. గతంలో ఉన్న కడప పేరును గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ జిల్లాగా పేరు మారుస్తూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు.. అయితే, దీనిపై ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు నిరసన తెలిపాయి. 200 సంవత్సరాల చరిత్ర కలిగిన కడప పేరు మార్పుపై ప్రజాసంఘాలు తీవ్రస్థాయిలో అభ్యంతరం తెలుపుతూ వచ్చాయి... ఇక, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కడప పేరు మార్పు వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది... వైఎస్సార్ పేరుతో పాటు కడప అన్న పదాన్ని కూడా చేర్చాలని ప్రజాసంఘాలు రాజకీయ పార్టీలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి.. ఈ మేరకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం కడప పేరు మార్పుపై గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.. పేరు మార్పుపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే నెలలోపు తెలపాలని కడప కలెక్టర్ శ్రీధర్ నోటిఫికేషన్ జారీ చేశారు.. ఈనెల 25 ఆఖరి తేదీ గడువు ముగియడంతో పాటు, ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో ప్రభుత్వానికి కడప పేరు మారుస్తూ నివేదికలు పంపారు జిల్లా అధికారులు... ఈ మేరకు ప్రభుత్వం వైఎస్సార్ జిల్లా పేరు మారుస్తూ వైఎస్సార్ కడప జిల్లాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో, ఇకపై వైఎస్సార్ జిల్లా కాస్తా.. వైఎస్సార్ కడప జిల్లాగా మారిపోయిందన్న మాట.. కాగా, వైఎస్ఆర్ జిల్లా పేరు మార్పుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న విషయం విదితమే.. ఇకపై వైఎస్ఆర్ కడపగా జిల్లా పేరు మార్చాలని నిర్ణయించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో వైఎస్ఆర్ జిల్లాకు కడప పేరు కలుపుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

గాంధీ కొండపై యోగాంధ్ర

ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

సృజనక్రాంతి/విజయవాడ : ఆరోగ్యవంతమైన శరీరం, ఆరోగ్యవంతమైన మనస్సు కలిగి ఉండాలని చెబుతూ.. దేహాన్ని దేవాలయంగా భావించి జీవితాంతం ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిచ్చిన మహాత్ముని ఆశయాల కీర్తి శిఖరమైన గాంధీ కొండపై యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించినందుకు చాలా ఆనందంగా ఉందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల సందర్భంగా సోమవారం విజయవాడలోని గాంధీ హిల్‌పై గాంధీ హిల్ ఫౌండేషన్, జిల్లా యంత్రాంగం, ఏపీ టూరిజం డిపార్టుమెంటు– సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని యోగాసనాలు అభ్యసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా ప్రజలకు యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించి జీవితాం తం ఆచరించేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాలకు వచ్చే పర్యాటకులకు కూడా యోగా ఔన్నత్యంపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటు–న్నామన్నారు. ఇందులో భాగంగా తొలుత గాంధీ హిల్‌పై నిర్వహించడం జరిగిందన్నారు. ఇదేవిధంగా భవానీ ద్వీపం, డా. బీఆర్ అంబేద్కర్ స్మృతివనం, కొండపల్లి ఖిల్లా తదితర ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. యోగాచరణను నిత్యజీవితంలో భాగం చేసుకొని ఆరోగ్యకర జీవితాన్ని సొంతం చేసుకుంటూ ఆరోగ్య భారత్ సాకారానికి కృషిచేయడం ద్వారా మహాత్మునికి నిజమైన నివాళులు అర్పిద్దామన్నారు. కార్యక్రమంలో భాగంగా గాంధీజీ తాత్వికత, యోగా, సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పే ప్రత్యేక ఎ÷–లానిటోరియం షో ప్రదర్శించారు. కార్యక్రమంలో గాంధీ హిల్ ఫౌండేషన్ ఛైర్మన్ డా. గాంధీ పీసీ కాజా, కార్యదర్శి వై.రామచంద్రరావు, సభ్యులు శివశంకర్ కస్తూరి, రావి శారద పాల్గొనగా బీహార్ యోగా విశ్వవిద్యాలయ స్వామి భక్తి చైతన్య, ఏపీ టూరిజం ప్రతినిధులు శిల్ప, ప్రసన్నలక్ష్మి, కృష్ణచైతన్య, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన నవచేతన వారి నుండి బాలల కథల పుస్తకం వెలువడింది. అసలైన బహుమతి ఎమెస్కో వారి సాహితీ ప్రచురణల నుండి బాలల కథల వెలువడింది. రెండు బాలల కథల పుస్తకాలు ఆదివారంనాడు కోడూరు శాంతమ్మ బాల సాహిత్య సదస్సులో ఆవిష్కరణ జరిగాయి.
– కైకాల వెంకట సుమలత

దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లు

స్పందించి తక్షణమే అందించిన కలెక్టర్

విజయవాడ : దివ్యాంగుల ఆవేదనను ఆలకించి ఆపై సత్వరం స్పందించి మూడు చక్రాల సైకిలును అందజేసి జీవిత మార్గాని జిల్లా యంత్రాంగంకి బాటవేసింది.. ప్రతి సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కరించే కార్యక్రమమైన ప్రజా సమస్యల పరిష్కార వేదిక దివ్యాంగుల జీవన మార్గానికి బాటలు వేసింది. ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లో ఒక కార్యక్రమాన్ని ముగించుకొని పర్యటనకు బయలుదేరుతున్న సమయంలో దివ్యాంగుణ్ని చూసి చలించి అతని వద్దకు వెళ్లి అర్జీని స్వీకరించి అదేరోజు బాధితునికి మూడు చక్రాల సైకిల్‌ను అందించారు. ఈ వార్తా కథనాన్ని చూసి అదే పరిస్థితిలో ఉన్న మరికొందరు తమకు కూడా న్యాయం జరుగుతుందనే ఆశతో మే 12వ తేదీన జరిగిన కార్యక్రమంలో నగరంలోని 21వ డివిజన్‌కు చెందిన సింహాద్రి క్షీరవర్ధి, విజయవాడ రూరల్ మండలం గొల్లపూడికి చెందిన అన్నవరపు వరప్రసాద్‌లు తాము నిరుపేద కుటుంబాలకు చెందినవారమని ఎలాంటి జీవనాధారం లేదని, నడవలేని స్థితిలో ఉన్న తమకు మూడు చక్రాల సైకిళ్లను అందజేసి ఆదుకోవాలని తద్వారా ఏదో ఒక జీవన మార్గాన్ని వెతుక్కుంటామని అర్జీలను సమర్పించారు. దీనిపై స్పందించిన జిల్లా యంత్రాంగం దివ్యాంగుల అర్హతలను పరిశీలించి దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లను సమకూర్చారు. జిల్లా రెవెన్యూ అధికారి దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల సహాయంతో సోమవారం కలెక్టరేట్‌లో ఇద్దరు దివ్యాంగులకు –ట్రైసైకిళ్లను అందించారు. అతి తక్కువ సమయంలో తమకు ఉచితంగా వాహనాలు అందజేయడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 167 అర్జీలు స్వీకరించినట్లు డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 65, పోలీస్ 30, ఎంఏయుడి 14, పంచాయతీరాజ్ 6, సర్వే 4, డిఆర్‌డిఏ 5, వైద్య ఆరోగ్యం 2, హౌసింగ్ 8, ఏపీసీపీడీసీఎల్ 2, డ్వామా 2 , జలవనరులు 2, బీసీ కార్పోరేషన్‌కు 7, ఎస్‌సీ కార్పొరేషన్ 1, వ్యవసాయం 2, గ్రామ, వార్డు సచివాలయాలు 3, ఉపాధి కల్పన 1, మార్కెటింగ్ 2, ఆర్‌డబ్ల్యూఎస్ 1, ఆర్ అండ్ బీ 3, నైపుణ్యాభివృద్ధి 1, సాంకేతిక విద్య 1, విభిన్న ప్రతిభావంతులు 1, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ 3, బ్యాంకింగ్ 1 అర్జీలు ఉన్నాయన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఆయా జిల్లా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మహానాడుకు నేతలు

గుంటూరు : కడపలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, అందుకు ముఖ్య నేతలు, కార్యకర్తలు బయలుదేరాలని గుంటూరు టిడిపి నేత, ఎమ్మెల్యే జివి ఆంజనేయులు పిలుపునిచ్చారు. మహానాడు సన్నాహక కార్యక్రమంలో భాగంగా టీడీపీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచక పాలన వలన రాష్ట్రం సర్వనాశనం అయిపోయిందని అన్నారు.